క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



సెక్రటరీకి రాజీనామా లేఖలను అందిస్తున్న ఊటుకూరు వలంటీర్లు

గోరంట్ల: మండల పరిధిలోని వడిగేపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని 15 మంది వలంటీర్లు సోమవారం రాజీనామ చేశారు. రాజీనామా లేఖను గ్రామకార్యదర్శికి అందజేశారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలోని సచివాలయం-2, ఊటుకూరు సచివాలయం పరిధులలో పని చేస్తున్న వలంటీర్లు రాజీనామాలు చేశారు. సోమవారం తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లికి గ్రామానికి చెందిన ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారని పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు తెలిపారు.

నేడు గంధం వేడుకలు

పెనుకొండ: పట్టణంలోని గోనిపేట రోడ్డులో వెలసిన షేక్ సయ్యద్ షా మహమ్మద్ ఖమ్రూద్దీన్ అలీ దర్గాలో ఈ నెల 16న అర్ధరాత్రి 1:30 గంటలకు గంధం వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగానే దర్గా దగ్గర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పేదలకు న్యాయం చేయండి

పెనుకొండ: పట్టణంలో మడకశిర రోడ్డులో సర్వే నంబర్ 668లో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని, అయితే అధికారులు ముందస్తు సమాచారం లేకుండా నిర్మాణాలను తొలగించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. ఇందులో భాగంగానే సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాయంలో ఏఓ కాటంబాబుకు సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. గంగాధర్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



కోనాపురంలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పరిగి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలో ఆయన పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు గుడిబండలో ఎన్నికల ప్రచారం

గుడిబండ: మండల పరిధిలలోని కరికెర, జంబులబండ పంచాయతీల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫ్యాను గుర్తుకు ఓటేయండి

సోమందేపల్లి: సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా అందాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మాజీ సర్పంచ్ రమకాంత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం సాయినగర్, పాత ఊరులో ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, సజ్జా రెడ్డి, కుళ్లాయిప్ప, వలీ, శ్రీనివాసులు, ఈశ్వర్ రెడ్డి, ఎల్లారెడ్డి, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



హిందూపురం: మంటలను ఆర్పే విధానాన్ని వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

హిందూపురంఅర్బన్/పెనుకొండ/మడకశిర రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర పట్టణాల్లో అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంబంధించినపుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. వడదెబ్బకు తీసుకోవాల్సి జాగ్రత్తలు, మంటలను ఏవిధంగా ఆర్పాలి తదితర వాటిపై అగ్ని మాపక అధికారులు ప్రజలు అవగాహన కల్పించారు. అదేవిధంగా వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా గ్యాస్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని మహిళలు గ్యాస్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

- పగటి పూటే 9 గంటల సరఫరా
- సంతోషంగా పనులు చేసుకుంటున్న అన్నదాతలు
- సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని హర్షం

పెనుకొండ నియోజకవర్గంలో పంపుసెట్లు ఇలా..

రొద్దం	4,080
పరిగి	2,269
సోమందేపల్లి	2,382
పెనుకొండ	3,500
గోరంట్ల	8,790



రొద్దంలో విద్యుత్ మోటార్‌తో పొలానికి సాగునీరు అందిస్తున్న దృశ్యం



రైతుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

రొద్దం: అన్నదాత ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. వ్యవసాయ రంగాన్ని పండుగ చేసేలా విప్లవాత్మక మార్పులతో ముందుకు దూసుకెళ్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షకులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని రైతులు సంతోషంగా చెబుతున్నారు.

వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి అన్నదాతన అండగా నిలుస్తోంది. ఇప్పటికే రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి నిధుల మంజూరు, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, పంట దిగుబడి రాకముందే మద్దతు ధర, నిష్పత్తుల సమయంలో బీమా సౌకర్యం, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, వైఎస్సార్ పొలంబడి ద్వారా రైతులకు చేరువైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యంగా రైతులకు నిరంతరాయంగా పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులు గురైన రైతులను ఆదుకునేందుకు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. మరీ ముఖ్యంగా రైతుల విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టేందుకు పగటి పూట విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టి ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారు. నిరంతరాయంగా వ్యవసాయ పంపు సెట్లకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ప్రజాసంకల్ప యాత్ర ద్వారా రైతు కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతల కష్టాలు తీర్చుస్తామని హామీ ఇచ్చి ఆదిశగా చర్యలు చేపట్టి మాట నిలుపుకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటలకు ముందుగానే పెట్టుబడి సాయం అందించడంతో పాటు పంట దిగుబడులను కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయం చేసేలా ప్రోత్సాహిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు సర్వీసులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వ్యవసాయంలో లోఓల్టేజీని అరికట్టిందుకు వ్యవసాయ మోటర్లకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు రెండు మోటర్లకు ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. (రైతు ఏర్పాటు చేసుకున్న మోటార్ల హెచ్‌పీని బట్టి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు) దీంతో వ్యవసాయ మోటర్లకు లోఓల్టేజీ సమస్య లేకుండా పోయింది. ఇప్పటికే మండల వ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇద్దరేసి రైతులకు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 4,080 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రైతు పక్షపాతి జగనన్న



రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పగటి పూట తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలుస్తున్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తూ తమ కష్టాలు తీరుస్తున్నారు. విప్లవాత్మకమైన నిర్ణయాలతో రైతుకు అండగా ఉంటున్నారు. – హేమలత, మహిళా రైతు, గౌరాజుపల్లి

సంతోషంగా పనులు



గత టీడీపీ హయాంలో వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేది కాదు. రాత్రి పూట విద్యుత్ సరఫరాతో రైతుల ప్రాణాలు ఫణంగా పెట్టాల్సివచ్చేది. నేడు పగటి పూటే విద్యుత్ అందిస్తుండటంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. – సూర్యానారాయణ చిన్నమంతూరు

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి

- ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు నమ్మొద్దు
- మంత్రి ఉషశ్రీచరణ్



రొద్దం మండలం లోచెర్లలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

రొద్దం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మంచిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ మళ్లీ ఆదరించాలని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రతిపక్షాలు చేసే కుట్రలు, కుతంత్రాలు, మోసాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని దొడగట్ట, తాడంగిపల్లి, ఎం కొత్తపల్లి, నారనాగేపల్లి, బూచెర్ల, ఆర్ లోచెర్ల తదితర గ్రామ పంచాయతీల్లో మంత్రి పర్యటించారు. నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికల ప్రచారంలో చేపట్టాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా మనమందరం కలసి మెలసి పట్టుదలతో పనిచేయాలన్నారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలే మనకు శ్రీరామ రక్ష అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాలతో పేద ప్రజల జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపాయన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా వలంటీర్ల ద్వారా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేసిన ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు.

ప్రజాదరణ ఓర్వలేకనే దాడులు

జగనన్నకు వస్తున జనాధారణ చూసి టీడీపీ అధినేత చంద్రబాబు ఓర్వలేక సీఎంపై దాడి చేయించారని మంత్రి ఉషశ్రీచరణ్ ఆరోపించారు. ఎన్నితోక పార్టీలతో కలసి వచ్చినా గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనన్నారు. ఓడిపోతామన్న భయంతోనే చంద్రబాబు , ఆయన టీమ్ దాడులకు తెగపడుతోందన్నారు. టీడీపీ శ్రేణులు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆ దేవుడు, ప్రజల ఆశీర్వాదం జగనన్నపై ఉండగా ఎవరూ ఏమీ చేయలేరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు ప్రజలకు యథావిధిగా అందుతాయని వివరించారు. ప్రజలు చంద్రబాబు తప్పుడు మాటలు, తప్పుడు హామీలు నమ్మితే మోసపోతారన్నారు.

25న నామినేషన్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 25న పెనుకొండలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, నాయకులు అక్కులప్పయాదవ్, మారుతీరెడ్డి, ధనుంజయ్, సి.నారాయణరెడ్డి, వీరేష, వినయ్‌రెడ్డి, రాజారెడ్డి, ఉజ్జినప్ప, రాజగోపాల్ రెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, బోయ నరసింహులు, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: కుల, మత రాజకీయలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి ఉన్నతికి తోడ్పటునందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని కళ్లగేర, మల్లాపల్లి, మల్లాపల్లి కొత్తపల్లి, బూగనిపల్లి, బూగానిపల్లితాండ, కొమ్మలతాండ, బూచేపల్లి, కొత్తపల్లి, పుట్టగుండ్లపల్లి, గుంతపల్లి, గడ్డంతాండ, కల్లితండా గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600కు పైగా హామీలు ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. అయితే ఇచ్చిన హామీలను జగనన్న అమలు చేస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాం నాయక్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాల్లాపల్లి, పుట్టగుండ్లపల్లి సర్పంచులు శివానంద, నార్శిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో టీడీపీకి చెందిన 20 మంది కార్యకర్తలు మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. అన్ని విధాల తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రత్నగిరి, కాకి పంచాయతీ పరిధిలోని బాజయ్యపాళ్యం, రత్నగిరిగొల్లహట్టి, రత్నగిరి, ఉజ్జీనీపురం , ఆర్.రంగాపురం, అలుపనపల్లి, అప్పేపల్లి, కాకి, కాకిగొల్లహట్టి, ఎల్‌కేపల్లి, ఎల్‌కే పల్లి వడ్రహట్టి, కె.బ్యాడిగెర గ్రామాల్లో మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజుతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత రత్నగిరిలోని కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయాన్ని వారు సందర్శించారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి దాకా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేర్చినట్లు పేర్కొన్నారు. మళ్లీ యథావిధిగా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్ సీఎం అయితేనే అది సాధ్యం అవుతుందన్నారు. ప్రస్తుతం ఎన్నికల దగ్గర పడుతున్న సమయంలో టీడీపీ అండ్ కో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తూ ప్రజలను మోసగించడానికి వస్తున్నారన్నారు. వారు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. తొమ్మిదేళ్లు చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది శున్యమని విమర్శించారు. కేవలం టీడీపీ నాయకులు జన్మభూమి కమిటీ పేరుతో దాచుకోవడం.. దోచుకోవడం.. పంచుకోవడంలోనే సరిపోయిందని నిప్పులు చెరిగారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్య పెట్టడానికి వస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్ చేసిన అభివృద్ధి మరెవరూ ఇంత వరకూ చేయలేదన్నారు. మరోసారి వైఎస్ జగన్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. విజయవాడలో శనివారం రాత్రి మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మడకశిర అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, డైరెక్టర్లు గగన, నేత్రావతి, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు రంగేగౌడు, రవిశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, ఎంపీపీ కవిత, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మండల జేసీఎస్ కన్వీనర్లు లోకేష్, కేటీ నాగేంద్ర, సర్పంచులు చిన్నరంగప్ప, ప్రకాష్, సదాశివప్ప, లక్ష్మమ్మ, ఎంపీటీసీ జగదీష్, వైస్ సర్పంచులు రాజు, రవికుమార్, సీఎం ఘట్ట రవి, సీనియర్ నాయకులు విజయరంగేడొడు, నగేష్ రంగారెడ్డి, బసవరాజు, శశికుమార్, పుట్టప్ప, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రొళ్ల మండలం బాజయ్యపాళ్యంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

బాబు మాయమాటలు నమ్మొద్దు



విభూదిపల్లిలో ర్యాలీగా వస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపిక

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ, దీపికా

లేపాక్షి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు అండ్ కో చెప్పే మాయ మాటలను ఎవరూ నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శాంతమ్మ , దీపిక ప్రజలకు సూచించారు. సోమవారం ఉదయం మండలంలోని కోడిపల్లి, నాగేపల్లి, విభూదిపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా వీరజవాన్ చంద్రశేఖర్‌రెడ్డి విగ్రహానికి దీపికాతో పాటు మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సోమనాథ దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం చేశారు. స్థానిక సర్పంచ్ మంజునాథ్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పసుపు కుంకుమ ఇచ్చి గొర్రె పిల్లను బహూకరించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా శాంతమ్మ, దీపిక మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఎన్నోసార్లు పేద ప్రజల బాగు కోసం బటన్ నొక్కారన్నారు. జగనన్న చేసిన మంచిని మరువకుండా ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి తమను గెలిపించాలని కోరారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు అధికారమే ధ్యేయంగా అనేక మోసపూరిత హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కారన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి, సాధ్యం కాని హామీలను ఇస్తూ మోసం చేయడానికి ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆయన ఎత్తులను ఓటర్లందరూ చిత్తు చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసి పేదల పక్షపాతిగా నిలిచారని గుర్తు చేశారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ మంజునాథ్, మాజీ ఎంపీపీ హనోక్, అగ్రిబోర్డు చైర్మన్ ప్రభాకర్, వాణిజ్య విభాగం నాయకుడు శ్రీకాంత్, లేపాక్షి, పులమతి సర్పంచ్‌లు ఆదినారాయణ, అశ్వత్తనారాయణ, స్థానిక నాయకులు ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, పాపన్న, మంజునాథ్, నరసింహమూర్తి, సత్యనారాయణ, తిప్పన్న, ఆదెమ్మ, రామాంజమ్మ, శ్రీరామప్ప, ఎంటి రామాంజి, రుద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

రొద్దం: మండల పరిధిలోని కలిపి, పెద్దమంతూరు, చెరుకూరు, చిన్నమంతూరు, నల్లూరు, చోళేమర్రి గ్రామాల్లో మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ తిమ్మయ్య తెలిపారు. ఉదయం 7 గంటలకు కలిపి గ్రామ పంచాయతీ నుంచి మంత్రి పర్యటన ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు కల్యాణోత్సవం

పెనుకొండ: మండలంలోని పెద్దచెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని, సాయంత్రం 4 గంటలకు ఉట్ల పరుష వేడుకలు, కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సిద్ధారూఢస్వామి ఉత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లికి వెళ్లే రహదారిలోని కొత్త చెరువు కట్టపై వెలసిన సిద్ధారూఢస్వామి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహానికి భక్తులు గంగ పూజ చేశారు. అనంతరం నూతనంగా భక్తులు తయారు చేయించిన గాలి గోపుర కలశాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సిద్దేశ్వర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గొడనకుంట, తమ్మడేపల్లి, అమరాపురం గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయండి

రొళ్ల: మండలంలో ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయ్యే విద్యార్థులను వివరాలను ఆన్‌లైన్‌లో తప్పని సరిగా హెచ్‌ఎంలు నమోదు చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత చార్జీలే వసూలు చేయండి



మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ సమత

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పలు మీసేవ కేంద్రాలను డీఎల్‌డీఓ సమత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీ సేవ లైసెన్సులు తనిఖీ చేశారు. అదే విధంగా ప్రజల వద్ద నిర్దేశిత చార్జీలను వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రొద్దం: మండల పరిధిలోని చేరుకూరు గ్రామ సమీపంలో పేకాట కేంద్రంపై ఆదివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్ఐ బాషావలి తెలిపారు. 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 30 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

హిందూపురం అర్బన్: మండలంలోని రాచపల్లి సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి 20,180 స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే సోమిరెడ్డి అనే నిందితుడు తప్పించుకోబోయి బైక్ నుంచి కింద పడ్డాడని చెప్పారు. క్షతగాత్రుడిని హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.